# మరణానంతరం

**పాత్రలు:**

స్త్రీ, పురుషుడు

**స్థలం:**

ఒక సాధారణమైన ఇల్లు. స్త్రీ, పురుషులు. స్త్రీ డైనింగ్ టేబుల్ మీదనుంచి తిన్న కంచాలు తీస్తూంటుంది. పురుషుడు డ్రెస్సింగ్ గౌన్లో చేతులు పెట్టుకుని ఎదురుగు చూస్తూ ఉంటాడు.

స్త్రీ: మళ్ళీ ఆలోచించడం మొదలెట్టారా?

పురు: (కళ్ళుమూసుకుని) లేదు.

స్త్రీ: కొంచెం అలా వెళ్ళి తిరిగి రాకూడదు!

పురు: తిరగాలనిపించడంలేదు.

స్త్రీ: (పళ్ళాలు ట్రేలో పెట్టుకుని) ఏమన్నారూ – ఏంలేదన్నారు? నాకేం వినిపించడంలేదు.

పురు: (జేబులోంచి సిగరెట్ తీస్తూ) అగ్గిపెట్టె – నువ్విప్పుడే తీసుకున్నావు.

స్త్రీ: (వినిపించుకోనట్టుగా) మీరు కొంచెం తిరిగివస్తే బాగుంటుంది. కాస్త మనస్సుకి విశ్రాంతిగా ఉంటుంది.

పురు: అగ్గిపెట్టె.

స్త్రీ: రోజూ రాత్రిపూట అన్నం తినేటప్పుడు ఎందుకో ఉదాసీనంగా ఉంటారు? (స్టూల్ మీంచి అగ్గిపెట్టె తీసి ఇస్తుంది)

పురు: వెళ్ళు కంచాలు లోపల పెట్టిరా!

స్త్రీ: మీరు కొన్నాళ్ళుపాటు ఏదైనా ఊరు వెళ్ళిరాకూడదు....నిజంగా చెబుతున్నాను.

పురు: హూ.......బయటకు వెళ్ళాలంటే...

(స్త్రీ ట్రే తీసుకు వెళ్ళిపోతుంది. పురుషుడు, స్త్రీ తన మాట వినలేదన్న భావంతో ఆమె వెళ్లిన వైపే చూస్తుంటాడు. సిగరెట్ దమ్ము లాగి పొగ వదిలి వెడతాడు. స్త్రీ తిరిగి వచ్చినా ఆమె వంక చూడదు)

స్త్రీ: మీరు ఊరు వెళ్ళలేనట్టున్నారు (తన చేతులు చూసుకుని) మళ్ళీ నా చేతులకి ఎగ్జిమా బాగి వచ్చింది.

పురు: (చిరుకోపంతో) ఎక్కడికి వెడతాను? వెళ్ళి ఏం చేస్తాను. ఎక్కడికెళ్ళినా ఒకటే......అంతా ఒకేలా ఉంటుంది. (కళ్ళెత్తి చూసేసరికి స్త్రీ తన చేతులను చూసుకుంటు ఉంటుంది)

స్త్రీ: మలాం డబ్బా ఎక్కడుందో ఏమో.....అది రాసుకుంటే తగ్గిపోయేది. (చెయ్యి చూసుకుంటూ) అయినా కొన్నాళ్ళు పాటు మీరు సూరత్ వెళ్ళి రండి.

పురు: (వ్యంగ్యంగా) సూరత్....(ఏదో ఆలోచిస్తూ) నా పెన్ను ఎక్కడ పెట్టాను ఇంతకుమునుపే దాంతో ఉత్తరం రాస్తూ.....

స్త్రీ: దేవ్ కలకత్తా వెళ్లిన తర్వాత ఎక్కడైనా వెళ్ళడాన్ని గురించి ఆలోచిస్తాను. దేవ్ వెళ్లి కూడా రెండు మూడు వారాలు గడిచాయి....అబ్బ చెయ్యి ఎంత దురదగా ఉందో?

పురు: ఇక్కడ ఎక్కడన్నా కింద పడిందా పెన్ను. ఇప్పుడే ఏదో ఆలోచన వచ్చింది – అంతలోనే మాయం అయ్యింది.

స్త్రీ: నిజంగా. వచ్చేవారం మీరు సూరత్ ఎందుకు వెళ్ళకూడదు? అదేమిటి పెన్ను మీ జేబులోంచే (లాల్చి) వేళ్ళాడుతుంటేను...అయినా అక్కడ మీకు చాలామంది స్నేహితులున్నారు కదా!

పురు: (లాల్చీలోంచి పెన్ను తీసి, మూసి తెరుస్తూ) సూరత్? ఇప్పుడు సూరత్ ఎలా ఉందంటే......(దగ్గు వస్తుంది దాని మూలంగా మాట పూర్తిచెయ్యలేకపోతాడు)

స్త్రీ: ఎన్నిసార్లు చెప్పానో....గుర్తుపెట్టుకుని మందు తీసుకోండీ అని....అది తప్ప అన్నీ గుర్తుంటాయి.

పురు: (దగ్గుతూ ఆపిన మాట మళ్ళీ చెపుతూ) సూరత్తా – వచ్చేవారం కాదు. అక్కడికి వెళ్ళాలనుకో – చూడాలి తర్వాత.

స్త్రీ: మీకిది బాగా మామూలే!

పురు: (పోట్లాడాలనే ఉద్దేశ్యం ఉన్నట్లుగా) ఏది మామూలు?

స్త్రీ: అదే! పెన్ను జేబులో పెట్టుకోండి. లేకపోతే మళ్లీ మర్చిపోతారు – పొద్దున్నే ఆఫీసుకి వెళ్లి.......

పురు: నేను నీకో మాట చెప్పనా....అంటే నేను అప్పుడప్పుడూ ఏమని ఆలోచిస్తానంటే....

స్త్రీ: అదే నే చెప్పేది....తీవ్రంగా ఆలోచిస్తారని – పెన్ను ముందు జేబులో పెట్టుకోండి –

పురు: కొన్నాళ్ళపాటు ఏదైనా పర్వత ప్రాంతానికి ఎందుకు వెళ్ళకూడదూ అని.....

స్త్రీ: ఇంత చలిలోనా – వెళ్ళండి.......అయినా మీ ఇష్టం......పెన్ను జేబులో పెట్టుకోండి.

పురు: కొన్నాళ్ళపాటు ఒంటరిగా ఉందామని.....(స్త్రీ వైపు చూస్తాడు జవాబు కోసం....జవాబు దొరకకపోయినా దొరికినట్లుగానే) కాని ఇప్పుడు అక్కడికి వెడితే మనస్సు మరీ ఒంటరిగా అయిపోయి....

స్త్రీ: మీ యిష్టం....మీకు నేను చెప్పగలిగేంత దాన్నా?

పురు: (సీరియస్‌గా అయి) చూడు....నేను వెళ్ళాలని ఎందుకనుకుంటున్నానంటే......

స్త్రీ: డార్జిలింగ్ ఎలా ఉంటుందో...

పురు: నేనెప్పుడూ వెళ్ళలేదా.....ఏం?

స్త్రీ: ఊరికే అడుగుతున్నాను.

పురు: (పరిస్థితికి అనుగుణంగా మారిపోయి) (బహుశా మామూలు ధోరణిలోనేమో) సరే చూడు రేప్పొద్దున్నించి – రేపటినుంచే (వత్తి పలుకుతూ) ఆఫీసులో చలాకీగా పనిచెయ్యాలని ప్రయత్నిస్తాను. కనీసం దాంతో నన్నా కొన్ని రోజులు..........ప్రయత్నించిచూడాలి.

స్త్రీ: ఎవరికో ప్రమోషన్ ఇప్పించాలనుకున్నారు...ఇప్పించారా? ఆ పని అయిపోయిందా?

పురు: వార్తలు అయిపోయి ఉంటయ్యనుకుంటాను.

స్త్రీ: ఇంక వేరే స్టేషన్ నుంచి వస్తున్నట్టున్నాయి.......ఆ వేళ మీరేం చెప్పారు.....

పురు: ఏ వేళ?

స్త్రీ: అదే...ఆవేళ....అవాళ. దేన్ని గురించో మాట్లాడుకుంటున్నాం.....మీరేదో పాస్‌పోర్ట్‌ని గురించి

మాట్లాడినట్టున్నారు.

పురు: నేను పాస్‌పోర్ట్ గురించి చెప్పానా....ఏం చెప్పాను?

స్త్రీ: (అలమరవైపు వెడుతూ) ఏదో చెప్పారు.....(అలమర తెరుస్తుంది) ఏమయిఉంటుదబ్బా....ఒకవేళ పాస్‌పోర్ట్ అయితే...(తిరగి అతని దగ్గరగా వచ్చి) అసలు ఎన్నాళ్ళు పడుతుంది పాస్‌పోర్ట్ తయారు కావడానికి......?

పురు: (ఆవలిస్తూ) కొంచెంసేపట్లో నిద్దర వచ్చేలా ఉంది!

స్త్రీ: ఎవరైనా ఒకవేళ విదేశాలు వెళ్ళిపోతే.....

పురు: విదేశాలా? అక్కడేముంది? నదులు–సముద్రాలు, రోడ్లు–జనం, తోటలు–కాలక్షేపపు స్థలాలు, బార్స్–బిల్డింగులు....ఏముంది వీటిల్లో...హాయిగా తిరిగేందుకు స్థలాలు.

స్త్రీ: మెచ్యూర్ అయినట్టే.....అందుకే అలా అనిపిస్తుంది.

పురు: ఏమన్నావు మెచ్యూరా?

స్త్రీ: లేకపోతే ఏమిటి? నేను మెచ్యూర్ అయ్యాను. మొదట్లో మనం ఎంత ఆనందంగా ఉండేవాళ్ళం..... చుట్టుపక్కల వాళ్ళు కూడా మనకి ఆనందంగానే కన్పించేవారు. ఇప్పుడు చుట్టు పక్కల వాళ్ళు – వాళ్ళతోబాటు మనమూ దుఃఖితులమే. ఇంతకంటె మెచ్యూరిటీ ఏంకావాలి!

పురు: తెల్లారి తొందరగా లేవాలనుకుంటున్నాను. ఆఫీసుకు వెళ్ళక మునుపు కొన్ని కాయితాలు చూడాలి.

స్త్రీ: మెచ్యూర్ అయిన వాళ్ళెవరో చెప్పండి. వాళ్ళల్లో దుఃఖమన్నది ఎంతమందికి తెలియదో చెప్పండి.

పురు: పని చాలా చెయ్యాల్సింది ఉంది. (ఓ క్షణం ఆగి, బయటికి చూసి) వాటిని లోపలికి రానివ్వచ్చునను కుంటున్నావా?

స్త్రీ: ఇలా ఉండడమే నిజమనుకుంటాను. ఇదే జీవితమనుకుంటాను.....

పురు: ఏమిటీ?

స్త్రీ: ఇదే...ఏడుస్తూ ఉండడం – ఆలోచించడం...ఇవి తప్పే చుట్టుపక్కల ఏమీలేవు. ఎవర్ని లోపలికి రానియ్యొచ్చా అని అడుగుతున్నారు.

పురు: పిల్లిపిల్లల్ని – కాని అవి ఇక్కడే....

స్త్రీ: అవి లోపలికి రావు....చూడాలి....ఇప్పుడు వాటికి బయట ఉండడమే అలవాటయింది....

పురు: ఇంకా ఏడురోజులన్నా కాలేదు అని......

స్త్రీ: ఏడురోజులంటే తక్కువేం కాదు. అదే మనిషైతే....ఏడురోజుల్లో.......ముసలాడయిపోతాడు. చూడు నా జుట్టు ఎంత తెల్లబడిందో?

పురు: నీ జుట్టు – తెల్లబడిందా?

స్త్రీ: ఆలోచించి అలా అయిపోయినయి తెల్లగా ఏడు సంవత్సరాల్లో...ఏడు సంవత్సరాలు...ఏడు రోజులు. ఎంత తేడా – ఊహూ..ఏమీలేదు.

పురు: సరే చెప్పు. రాత్రికి కిటికీ సంగతి ఏం చేద్దాం.

స్త్రీ: ఏం చెయ్యాలి?

పురు: తెరిచి ఉంచుతారా లేకపోతే......

స్త్రీ: ఎట్లా అంటే అట్లా. తెరవనూ వచ్చు. ముయ్యనూ వచ్చు.

పురు: మూస్తే గాలి ఆడదు. ఉక్కగా ఉంటుంది.

స్త్రీ: తీస్తే చలేస్తుంది.

పురు: అయితే!

స్త్రీ: ఏం లేదు. కొత్త చెప్పులు కొనుక్కోండి అని చెపుదామనుకున్నా.

పురు: చెప్పులా...ఆ....చెప్పులు తీసుకోవాలి.

స్త్రీ: ఇంకేమయినా తీసుకోవాలా మీరు?

పురు: ఏమిటీ?

స్త్రీ: (చెయ్యి గోక్కుంటూ) గుర్తు లేదు.....ఏదో కొనుక్కోవాలనుకున్నారు.

పురు: నువ్వు మళ్లీ గోకుతున్నావు.

స్త్రీ: ఏం చెయ్యను....అది....ఆ ఆయింట్‌మెంట్ లేదు!

పురు: ఏమిటది?

స్త్రీ: ఆయింట్‌మెంట్!

పురు: మరే దొరకను కూడా దొరకదు – (మంచం మీద పడుకుంటూ) అబ్బా అలసటగా ఉంది. నీకు లేదూ?

స్త్రీ: ఏమో......నాకేం తెలియనే తెలియడం లేదు.

పురు: (కాళ్లుజాపుకుంటూ ఆపేసి) ఆ గుర్తు వచ్చింది...ఆ మాట గురించి.....

స్త్రీ: ఏమాట...

పురు: నిన్న పడుకోబోయే ముందు నువ్వేదో చెప్పావు చూడు...

స్త్రీ: ఏం చెప్పాను (సాలోచనగా)

పురు: ఏదో చెప్పావు....ఇవాళ మీకు ఓ మాట గుర్తు చేస్తాను అన్నావు.

స్త్రీ: గుర్తు లేదు. ఏం చెప్పానో – రేపు గుర్తు చెయ్యండి......మీకు గుర్తువస్తే.

పురు: కావచ్చు.

స్త్రీ: వంటింట్లో అన్నిటి మీదా మూతలు పెట్టానో లేదో చూసి వస్తాను. (వెళ్ళిపోతుంది లోపలికి. పురుషుడు లేచి తిరుగుతూ కిటికీ దగ్గరికి వెడతాడు. స్త్రీ చాలా ఉత్సాహంగా వస్తుంది)

స్త్రీ: పిల్లి పిల్లలు ఎంత పెద్దవయ్యాయో చూసారా?

పురు: (వినిపించుకోనట్టుగా) ఇందాకేదో సూరత్ వెళ్ళమని చెపుతున్నట్టున్నావు.

స్త్రీ: కొన్నాళ్ళు పోతే వాటిని అడగడానికి చాలామంది వస్తారు కదూ!

పురు: నేనేమనుకుంటున్నానంటే.....

స్త్రీ: మీకిష్టమయితే మీరు వెళ్ళండి.

పురు: కొన్ని రోజులు సముద్రం ఒడ్డున తిరిగివస్తే.....

స్త్రీ: నేనిప్పుడేగా అలా వెళ్లి తిరిగిరండీ అని చెప్పాను. ఇక్కడికి వెళ్ళలేదు కానీ.....

పురు: నేనేమంటున్నానంటే....

స్త్రీ: సముద్రపు ఒడ్డున తిరిగితే ఏం బావుంటుందో నాకు తెలియదబ్బా నాకయితే ఏమాత్రం ఇష్టం లేదు.....కిటికీ అడ్డంగా లేవండి..గాలి రానీండి.......

పురు: నాకు చాలా ఇష్టం సముద్రం ఒడ్డున తిరగడం అంటే ఎంత బావుంటుందో. నిలువెత్తు అలలు ఛపక్.....ఛపక్ మని చప్పుడు చేస్తూ లేస్తూ ఉంటే.....

స్త్రీ: సూరత్‌లోనేనా.....నా చలికాలపు డ్రెస్సెస్ అన్నింటినీ పురుగులు కొట్టేశాయి.....

పురు: అవి ఎందుకు కొట్టేశాయంటే...మనం అక్కడ అర్ధరాత్రిదాకా తిరుగుతూ ఉండే వాళ్ళం కదా!

స్త్రీ: ఎందుకు కొట్టేశాయండీ....చెప్పండీ!

పురు: ఎప్పుడూ మీకు దూరంగా ఉన్న వస్తువుల మీదే ఆలోచన. దగ్గరున్న వాటి గురించి పట్టించుకోనే పట్టించుకోరు. కాని వాటి .....మాత్రం మీకు కావాలి. (తలుపు దగ్గరకెళ్ళి పురుషుడు బయటికి చూస్తూ ఉంటాడు)

పురు: వాటిల్లో ఒకటి బాగుంది.

స్త్రీ: వేటిల్లో?

పురు: పిల్లిపిల్లల్లో తెల్లని మచ్చలు ఉన్న పిల్లిని.....నువ్వు దాన్ని మాత్రం ఎవరికీ యివ్వకు.

స్త్రీ: నాకు ఇంకోటి బాగుంది.....

పురు: ఓ నెల రోజుల పాటు ప్రోగ్రాం వేసుకుని సూరత్ వెడదామా?

స్త్రీ: (సంబరంగా) ఇద్దరమూనా? నిజంగా....ఇద్దరం వెడదామా....(నిరాశగా) స్కూల్లో పిల్లలకిప్పుడు పరీక్షలు అవుతున్నాయి. నెలరోజుల పాటు సెలవులు నాకెవరిస్తారు?

పురు: (నిజమే అన్నట్లుగా) ఊ.....(ఆలోచిస్తూ వేళ్ళతో లెక్కలు పెడుతూ) నీకు 20 రోజులు సెలవులు వస్తున్నాయి కదా! అప్పుడే, 20 రోజులకే ప్రోగ్రాం వేసుకుందాం.

స్త్రీ: అప్పుడా......అప్పుడేదో ఉంది కదా!

పురు: ఏమిటది?

స్త్రీ: ఏదో ఉంది.....గుర్తుకు రావడంలా మీకు.

పురు: లేదే......నాకు తోచినంత వరకూ.......

స్త్రీ: ఏదో ఉంది....గుర్తు రావడం లేదు. ఇప్పుడే చెపుతానుండండి.

పురు: పోనీ గుర్తువచ్చేంతవరకూ.......

స్త్రీ: (ఒక్కఉదుటన) ఆ.....గుర్తొచ్చింది.

పురు: (నిరాశగా) గుర్తొచ్చిందా...అయితే.....

స్త్రీ: మీటింగు ఉన్నది కదా అప్పుడు!

పురు: మీటింగా....

స్త్రీ: మీ మీటింగే! పోయినవారం నేను దేన్ని గురించో చెపుతుంటే మీరు ఈ మీటింగ్ గురించి నాకు చెప్పారు.

పురు: ఏమిటీ?

స్త్రీ: మనం సెలవుల్లో సూరత్ వెడదామని...సూరత్....

పురు: (పట్టుబట్టినట్టుగా) ఆ...ఆ......అదా! ఆ మీటింగా సరే. లెట్ అజ్ సీ......(తిరుగుతూ కిటికీ దగ్గరకి వెడతాడు)

స్త్రీ: (తిరుగుతున్న అతన్ని చూసి) అబ్బ మీరు చాలా సెన్సిటివండీ. అందుకే తొందరగా నీళ్లు కారిపోతారు.

పురు: (బయటికి చూస్తూ) అదే ట్రాజడీ!

స్త్రీ: ఆ లెక్కకి వస్తే నేను సెన్సిటివ్వే కాని అంత బయట పడను....

పురు: అన్నిటి కంటే పెద్ద ట్రాజడీ ఇది.

స్త్రీ: నేను కూడా ఎప్పుడూ మీకు మల్లే సెన్సిటివ్‌గా ఉండి ఉంటేనా.....

పురు: సరే చూడు...మీటింగ్ ఒకవేళ కాన్సిల్ అయిపోతే, అప్పుడు....

స్త్రీ: (రోదన స్వరంతో) కొంచెం పొరపాటయితే చాలు నా వల్ల – ఊరికే అరుస్తారు. విసుక్కుంటారు.

పురు: (కొంచెం తీక్షణంగా) నేను అరిచానా. అక్కడికి నువు దబాయించినట్లే నా ఎదురుగా నుంచుని ఘుమికీలు తీస్తావే!

స్త్రీ: అదే....అదే నా సెన్సిటివిటీకి కారణం.

పురు: పోనీ నేను అప్పుడు నీకు నచ్చచెప్పాలని చూస్తే తల ఎగిరేసి "ఇది తప్పు ఇంకేమైనా చెప్పండి" అంటావు.

స్త్రీ: అదే....నేను సెన్సిటివ్‌గా ప్రవర్తిస్తే "పోనీ మీటింగ్ కాన్సిల్ చెయ్యనా" అంటారు.

పురు: కాదని ఎలా చెప్పగలను....అటూ ఇటూ కాకుండా ఉంది.

స్త్రీ: ఇంకా అక్కడే నుంచున్నారు. గాలి అంతా మీ పరమేనా?

పురు: సరే కాన్సిల్...అయితే చూడాలి.

(కిటికీ దగ్గర నుంచి లేస్తాడు)

స్త్రీ: అబ్బ ఏం ఇల్లో బాబూ – ఇంటినిండా అన్నీ కిటికీలే; గాలి వెలుతురూ మాత్రం రావు.

పురు: ఆ కన్నం పూడిపించావా? పక్కవేసుకున్న చోట – గోడ పక&కగా.

స్త్రీ: చూస్తూనే ఉన్నారుగా. నాకు తీరికెక్కడిది?

పురు: (గొణుక్కుంటున్నట్లుగా) రాత్రి తెల్లవార్లూ ఎలకలు పడుకోనీటం లేదు. పిల్లిని పెంచిదేమో అందుకు.....

స్త్రీ: మీరు పెంచారా? (విసురుగా) నేను దాన్ని కిచెన్‌లోకి, గదుల్లోకి రానిస్తున్నానని అనేవారు....

పురు: నేనేమన్నాను ఇప్పుడు. రాత్రిపూట హాయిగా నిద్రపోవాలనుకోడం తప్పుకాదుగా!

స్త్రీ: మీరు బాలెన్స్‌డ్‌గా ఉంటే నిద్ర అదే వస్తుంది.

పురు: ఎంతో హైరానా అయితే కాని అలా ఉండం కదా!

స్త్రీ: మీరెప్పుడు బాలెన్స్‌డ్‌గా ఉన్నారు కనుక!

పురు: అదే ఇబ్బందిగా ఉంది....

స్త్రీ: బాలెన్స్‌డ్‌గా లేరని తెలిసినప్పుడు ఉండడానికి ఎందుకు ప్రయత్నించరు?

పురు: (చికాకుగా) ఎందుకు ప్రయత్నించడం లేదు? చెప్పినంత తేలికేం కాదు చెయ్యడం –

స్త్రీ: చెయ్యాలనుకుంటే ఏమైనా చెయ్యగలడు మనిషి – చెయ్యాలనుకుంటేనే సుమా!

పురు: (ఒక్కనిముషం ఆమె వైపు ఓరగా చూసి – ఓడిపోయినట్లుగా చేతులు జేబులో పెట్టుకుని అటు ఇటు

తిరుగుతాడు) ఏదో ఒకటి జరుగుతుంది. ఎప్పుడు – (ఇప్పుడు స్త్రీ అతనికి దగ్గరగా వస్తుంది)

స్త్రీ: ఇప్పుడతనికి ప్రమోషన్ ఛాన్సెస్ ఏం లేవా?

పురు: లేవు. వచ్చే సంవత్సరం చూడాలి. (స్త్రీ అతన్నించి కొంచెం దూరంగా జరుగుతుంది)

స్త్రీ: వచ్చే సంవత్సరమా – ఏమో – అయినా ఆఫీసు విషయాలన్నీ ఎందుకింత ఎమోషనల్‌గా ఆలోచిస్తారు?

పురు: నేను అంత ఎమోషనల్‌గా ఆలోచించను. కాని ఆలోచించాల్సి వస్తోంది. నెత్తిమీద ఈ సమస్యలు లేకుండా ఉంటే...

స్త్రీ: పెట్టుకోమని ఎవరు చెప్పారు? ఇహ అవి పెట్టుకుని వాటిని గురించే ఆలోచిస్తే ఇల్లు పట్టించుకోరూ; ఉద్యోగమూ తిన్నగా చేయలేరు. (పురుషుడు పడక కుర్చీలో కూర్చుంటాడు)

పురు: అప్పుడు ఒంటిగా ఉంటే విసుగ్గా ఉండేది.

స్త్రీ: (కవ్విస్తూ) ఏం ఇప్పుడు ఇలా ఉంటే, ఈ రకమైన జీవితమంటే విసుగు పుట్టిందా?

పురు: ప్రతి మనిషికీ తనదీ అంటూ ఓ జీవితం ఉండాలని అనుకుంటున్నాను.

స్త్రీ: అంటే ఇల్లు – ఇల్లాలు లేకుండానా?

పురు: కాదు – అవన్నీ ఉంటూ కూడా ఎవరి జీవితం వారధిగా ఉండొచ్చు.

స్త్రీ: ఎలా?

పురు: అదే తెలియడం లేదు –

స్త్రీ: అయితే అటువంటి జీవితం కోసం ఆలోచించండి.

పురు: లెట్ అజ్ సీ.

స్త్రీ: లెట్ అజ్ సీతో ఏమవుతుంది?

పురు: రేపటినుంచీ చూద్దాం. ఆఫీసులో చాలా పనుంది. ఇంక వేరే దేన్ని గురించి ఆలోచించడానికి వ్యవధి లేనంతగా దాన్లో మునిగిపోవాలి. చూడాలి – దాన్లో మునిగిపోగలనో లేదో? (నెమ్మదిగా ఆవలిస్తాడు)

స్త్రీ: నిద్ర వస్తోందా? (పక్కనే ఉన్న మంచంమీద కూర్చుంటుంది)

పురు: రాత్రి ఎక్కువగా నిద్ర పట్టదా – అయినా ఇప్పుడు నిద్రేమంత ముంచుకు రావడం లేదులే. నీకు నిద్ర వస్తున్నట్టుంది పడుకో.

స్త్రీ: నాకు అన్నంతింటూనే నిద్ర వస్తుంది. కాని పడుకోడం ఎలా?

పురు: ఏం?

స్త్రీ: మీరు మాట్లాడుతూనే ఉంటారాయే. తయారయితే –

పురు: ఎందుకు? ఏం తయారవ్వాలి?

స్త్రీ: ఎందుకైనా సరే!

పురు: మునుపు సినిమా చూడాలని ఉండేది.

స్త్రీ: సరే అదయితే నిన్నా ఉంది. మొన్నా వుంది.

పురు: కాని ఇంట్లోంచి బయటికి వెళ్ళి తిరిగి రావాలని –

స్త్రీ: మంచి సినిమా ఏం లేదా?

పురు: బోర్....

స్త్రీ: ఇప్పుడు వచ్చేవి అన్నీ విసుగుపుట్టించే సినిమాలే కాని సౌండ్ ఆఫ్ మ్యూజిక్ చూద్దాం.

పురు: ఎక్కడ ఆడుతోంది?

స్త్రీ: చాలా మంచి పిక్చరంట – ఎన్నాళ్ళయినా మర్చిపోలేం.

పురు: నువ్వెప్పుడు చూశావు?

స్త్రీ: ఎక్కడో చదివాను – చూడలేదు.

పురు: నేనివాళ దాన్ని గురించే ఆలోచించాను.

స్త్రీ: ఎక్కడ చదివానో గుర్తు రావడంలా.

పురు: అదే ఎక్కడ.......స్వీ.....ఏం పేరు అదీ? స్వీడన్.

స్త్రీ: ఎలా ఉంటుందో ఏమో....బోర్‌గానే ఉంటుందేమో!

పురు: (ఆవలించి) కాసేపు కాలక్షేపం.....అంతే....

స్త్రీ: మఫ్లర్ తెచ్చిఇవ్వనా – ఏమో నా మనస్సు ఫిలిమ్ చూసి మరీ నీళ్లు కారిపోతుందేమో – మీకే అలా కాదు కదా!

పురు: కాదు – మఫ్లర్ వద్దు. ఇదివరకు నేను చాలా సినిమాలు చూసేవాణ్ణి.

స్త్రీ: నేను కూడా. కాని ఇదివరకు సినిమాలు చూసినప్పుడు చాలా ఉత్సాహంగా ఉండేది.

పురు: ఏదో ఇందాక చెప్పాలనుకున్నమాట గుర్తువచ్చినట్లే వచ్చింది – మళ్ళీ ఇంత లోనే మర్చిపోయాను

(ఓ నిముషం నిశ్శబ్దంగా ఉంటారు ఇద్దరు)

స్త్రీ: అయితే దాన్నే అట్టి పెట్టుకుందామా?

పురు: దేన్నీ?

స్త్రీ: తెల్ల మచ్చలు ఉన్న దాన్ని!

పురు: కొంచెం ముందుకు వంగి – మొదట మొదట ఏవంటే ఇష్టమో అవంటే ఇప్పుడు అంతగా ఇష్టం అనిపించడంలేదు.

స్త్రీ: నేను ఆలోచించాను –

పురు: ఏమిటది?

స్త్రీ: అన్నీ అలాగే ఉన్నాయి. సంవత్సరం అంతా ఇలాగే గడపాల్సి వస్తోంది.

పురు: చూస్తూ ఉన్న వాటిని చూస్తే ఇవి అన్నీ కూడా మనకి తెలిసినవే! వీటిల్లో కొత్తదనం ఏమీ లేదు అని అనిపిస్తోంది. (భార్య ఏడుస్తున్న ధ్వని) అరె! ఇందులో అంత బాధపడాల్సినదేముంది?

స్త్రీ: నేనేమీ బాధపడడం లేదు. కాని ఒకటి మాత్రం నిజం – నేనెప్పుడూ దేన్నీ గురించి ఫిర్యాదు చేయకూడదని నిశ్చయించుకున్నాను.

పురు: చూడు....ముందు ముందు...

స్త్రీ: నేను నిజంగా ఫిర్యాదు చేయకూడదనే నిశ్చయించుకున్నాను.... (వేలితో కన్నీళ్ళు తుడిచేస్తుంది)

పురు: ఏడుస్తూనే ఏడవడం లేదంటావు. జీవితమంటే ఏమనుకున్నావు. ఇలా నవ్వుతూ ఏడుస్తూ బ్రతికే బ్రతుకే జీవితం. ఏదైనా ఒక విషయం జీవితంలో.... (స్త్రీ కొంగుతో మొహం తుడుచుకుని స్థిమిత పడుతుంది)

స్త్రీ: ఏమిటి అంటున్నారు మీరు?

పురు: మనిషికి రోజూ కొత్త ఉత్తేజాన్ని ఇవ్వగలిగితే......కాని ఇప్పుడు మనం జీవిస్తున్న జీవితంలో అదేం లేదు.

స్త్రీ: నేను ఆ రోజే చెప్పాను మీకు.

పురు: మనిషి రోజు తింటం – పడుకోవడం – అలాగే మార్పులేని జీవితం జీవించడం – మాట్లాడాలి కనుక ఏదో ఒకటి మాట్లాడడం – కాని వీటికి భిన్నంగా....

స్త్రీ: నేను అది ఆలోచించడం కూడా మానేశాను.

పురు: ఏదైనా ఒక సమస్యలో చిక్కుకుని నేను దీన్ని తప్పనిసరిగా చెయ్యాలి అని అనుకోడం బాగుంటుంది.

స్త్రీ: రోజంతా స్కూల్లో చదువు చెప్పండి – బజారు వెళ్ళి కూరలు తెండి. తెచ్చి తెచ్చి నా చేతులు విరిగిపోతున్నాయి. ఇంటికి వచ్చి వంట చెయ్యండి – కానీ ఏం లాభం వీటిల్లో ఏదీ మీ వల్ల కాదని తెలుసు.

పురు: సరే! అవన్నీ నువ్వు చాలా అర్థవంతంగా చేస్తున్నావుగా!

స్త్రీ: చెయ్యాలి కనుక చేస్తున్నాను – ఈ రోజులు ఇట్లా వెళ్ళమారి పోవాల్సిందే!

(పురుషుడు కుర్చీ లోంచి లేచి అటు ఇటూ తిరుగుతూ ఉంటాడు)

పురు: ఏదైనా ఒకటి మనస్సుని ఆలోచింపచేస్తుందేమోనని చూస్తాం. ఒకవేళ ఆలోచింపచేసినా 5, 10 నిముషాలు కాకపోతే ఓ గంట – అయినా ఓ గంటంతా ఏదైనా విషయాన్ని ఆలోచించడానికి వృథా చేస్తామా?

స్త్రీ: రోజూ రెండేసి గంటలు మాట్లాడుతూనే మళ్ళీ.......

పురు: ఏదీ మనల్ని హోల్డ్ చేయలేదు. ఏదో జరగాల్సింది జరగలేదనిపిస్తోంది. బహుశా రేపవుతుందేమో అనుకుంటే అదీలేదు. ఏమీ అర్థం కావడంలా....

స్త్రీ: అసలు ఏం చెయ్యాలన్నది నిశ్చయమయితే రేపు పని తప్పకుండా అవుతుంది. ఆ రేపనేది కళ్లు మూసుకుని తెరిచేలోగా వచ్చేస్తుంది.

పురు: ఆ! అక్కడే చిక్కొచ్చింది డాలింగ్! అదే చిక్కు. ఫైళ్ళు తిరగెయ్యడం, ఛాయ్ తాగడం, పిచ్చి పాటీ మాట్లాడడం ఏదో పెళ్లి – పేరంటాలు లేదా ......గురించి – అదీ కాకపోతే పార్టీలకి వెళ్ళడం –

స్త్రీ: మెహతా వాళ్ళింట్లో పార్టీ బాగుంది కదూ! వంట చాలా రుచిగా చేశాడు........చాలా మంచి వంటవాడు ఉన్నాడు వాళ్ళదగ్గర. ఆ రోజు పార్టీలో బలే నవ్వాను నేను చాలా రోజులు తర్వాత బాగా నవ్వాను. ఎందుకో తెలియదు.

పురు: ఏమైనా చెయ్యి. ఈ నిశ్శబ్దం. ఈ ఏకాంతం యథాప్రకారం అలాగే ఉంటాయి.

స్త్రీ: మళ్ళీ చెపుతున్నాను – మీరు అక్కడికి.....అదే సూరత్‌కి వెళ్ళిరండి.

పురు: ఇదేదో వేళాకోళంగా ఉందే....అదేదో –

స్త్రీ: వేళాకోళమా. దేన్ని గురించి మీరనేది.....నాకేం అర్థం కావడంలా....

పురు: లేకపోతే మోసం అను.....

స్త్రీ: (తన చేతిని చూసుకుంటూ) ఆ మందు దొరికితే బావుణ్ణు – రెండు రోజుల్లో ఇది తగ్గిపోతుంది.

పురు: ఏమిటది?

స్త్రీ: ఆయింట్‌మెంట్....దొరకనే దొరకడంలా.

పురు: మానవుడు ఏదైనా ఒక విషయంలో దీన్లో సారముంది – బయటకు వస్తుంది అని అనుకుంటూ ఉంటాడు...

స్త్రీ: కొంచెం రాసుకుంటే...రోజుకు రెండుసార్లు చాలు.

పురు: తను చూసిన దాన్లో కాకపోతే మరెక్కడి నుంచైనా సరే తప్పకుండా.....

స్త్రీ: దాని పేరేమిటి – ప్చ్....ఏమిటో గుర్తుకు రావడంలేదు.

పురు: తనకి తెలియని వస్తువుల్లో – తనకి తెలియని మనుష్యుల్లోంచి.....కాని ఆ వస్తువుల గురించి, మనుష్యుల గురించి నిజంగా తెలుసుకున్న వారు......

స్త్రీ: ......మనం దాన్ని...అక్కడే.....అక్కడికి వెళ్ళినప్పుడే – అదే సూరత్‌లో తీసుకున్నాం గుర్తుందా?

పురు: ఎక్కడా ఏమీలేదు....ఎక్కడా ఏమీ లేదు....అంతా ఒకటేనని తెలుస్తుంది.

స్త్రీ: ఏమిటో? ఏమీలేదు ఏమీలేదు అంటున్నారు. ఏంలేదో?

పురు: అటువంటప్పుడు పురుషుడు ఏం చేస్తాడు?

స్త్రీ: ఏం చేస్తాడు?.....జయించేందుకు ప్రయత్నం....ఈ సారి కనక సూరత్ వెళ్లకపోతే.....

పురు: ఓహ్ జయించేస్తాడు....

స్త్రీ: .....గుర్తు పెట్టుకు తెస్తారు కదూ!

పురు: ఏమిటది?

స్త్రీ: ఆయింట్‌మెంట్. దాంతో బాగైపోతుంది....లేకపోతే ఈ తెల్ల పిల్లిపిల్లలు .........

పురు: ఎప్పుడూ ఏదీ తిన్నగా ఉంటుందని నేను అనుకోను....(జేబుల్లో చేతులు పెట్టుకుని అటూ ఇటూ తిరుగుతాడు)

స్త్రీ: ఏమన్నా కావాలా మీకు?

పురు: ఆ.....అది ఉందా నీ దగ్గర.....

స్త్రీ: నా దగ్గరా......

పురు: ఆ.....అహ కాదు......ప్చ్ గుర్తులేదు – ఏం చెపుదామనుకున్నానో గుర్తు లేదు.

స్త్రీ: మీకు మందు ఇస్తాను. లేకపోతే తెల్లవార్లు – దగ్గుతూంటారు.

(వెళ్ళి మందు, స్పూన్ పట్టుకువస్తుంది)

పురు: నాకెప్పుడూ ఇలాగే అవుతుంది.

స్త్రీ: ఏమిటీ?

పురు: ఆలోచించక మునుపు ఉన్న మాట ఆలోచించి చెపుదామనుకునే లోపల.....

(మందు తాగి తల అటు ఇటు తిప్పి స్పూన్ ఇచ్చేస్తాడు)

స్త్రీ: కొంచెం సేపు చూద్దాం.

పురు: ఎందుకు – దేనికీ....

స్త్రీ: ఊరికే అన్నాను.

పురు: ఏష్ట్రే ఇయ్యి కొంచెం. ఎక్కడా.....వాడి బదులు ఇంకోడు ప్రమోట్ అయ్యాడు. ఎందుకూ పనికిరాని వాడు....సరే! దేవ్ వెళ్ళేంత వరకూ దేవ్ వెడతాడు. ఇదిగో వెడతాడు అని అనుకోడంలోనే సరిపోయింది.

స్త్రీ: ఇప్పుడేమో వెళ్లిపోయాడు అనుకుంటున్నారు అన్నట్లు మీకోసం వేయించి మూంగీఫల్ దాచాను. పెట్టడం మర్చిపోయాను.

పురు: నిజమెంత విలక్షణమైంది – నిజంగా ఎంత ఆశ్చర్యం.

స్త్రీ: ఏమిటిది?

పురు: ఎప్పుడూ ఆ మాట అనుకోలేదా?

స్త్రీ: ఏమాట?

పురు: మనుషులు వస్తూ పోతూ ఉంటే.......(మూంగీఫల్ తీసుకుని) ఎంత వ్యత్యాసం....(తింటూ) బాగా వేగాయి....

స్త్రీ: (తనుకూడా వలుచుకుంటూ) మీకేదీ ఇష్టం అనిపించదాయేనె. మీకిష్టం అయింది ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూనే వుంటాను. ఆకు కూర పప్పా లేకపోతే సొరకాయా....(కొంచెం గద్గద భావంతో) రోజంతా ఎండనబడి తిరుగుతూ ఉంటారు. స్కూల్ నుంచి ఇంటికి....ఇంటి నించి బజారుకి – మీకేమో ఇంత తిరిగినా చాలదు. (పొట్టు) తొక్కలు కింద వెయ్యకండి.

పురు: (తొక్కలు ఏం చెయ్యాలో తెలియక) నేను నిజంగా చాలా గిల్టీగా ఫీలవుతున్నాను. ఆఫీసులో కూర్చుని ఇదే ఆలోచిస్తున్నాను......(తొక్కలు ఒక చేతిలోంచి ఇంకో చేతిలోకి మారుస్తుంటాడు) నువ్వు నాకేది ఇష్టమో అని చేస్తుంటావా......

స్త్రీ: లేకపోతే! మీరు ఊరికే గిల్టీగా ఫీలవుతారు....(తొక్కల వైపు చూస్తూ) ఇక్కడ టేబుల్ మీద పెట్టండి.

పురు: నాకే తెలియడం లేదు. ఎందుకు నా మనస్సు ఇంత ఉదాసీనంగా తయారవుతోందో. (తొక్కలు టేబుల్ మీద పెడుతూ హఠాత్తుగా) వార్తలు వచ్చే టైమ్ అయిందే!

స్త్రీ: ఆ! నే సాయంకాలం వార్తలు విన్నాను – ముఖ్యమైనవి ఏం లేవు!

పురు: (సీరియస్‌గా) ఇది చెయ్యకూడదు....అది చెయ్యాలి – ఇక్కడ ఉండకూడదు అక్కడికి వెళ్ళాలి అని అనిపిస్తుంది.

స్త్రీ: విదేశాల నుంచి ఎవరో వచ్చారటగా.....ఎక్కడో ప్రధానమంత్రి! ఆయన్ని గురించే ఎక్కువ మాటలు చెప్పారు.

పురు: ఒకే టైమ్‌లో ఎన్నో సుత్తులు పెట్టి కొట్టినట్లుంటుంది. ఎన్ని పనులో వాటిల్లో రోజూ వచ్చే పోయే వాళ్ళు. ఆఫీసు ఫైళ్ళు – ప్రమోషన్ లేదు...ఇన్నింటి మధ్యా ఆ ప్రమోషన్ కేసే గుర్తుకొస్తుంటుంది.

స్త్రీ: ఎవరిదో ప్రమోషన్ ఆగిపోతే మతిపోయేట్లు ఆలోచించడం ఎందుకు?....మొహం మీద తొక్క అంటుకుంది.

పురు: అదే నీకు అర్థం కానిది – (మొహానికి అంటుకున్న తొక్కని తీసేస్తూ) వాడికి ప్రమోషన్ వచ్చి ఉంటే నా పని సగం.....

స్త్రీ: అయ్యో! ఇప్పుడు గుర్తొచ్చింది.

పురు: (ఇందాకటనుంచీ ఎందుకు చెప్పలేదన్నట్లుగా) ఏమిటది?

స్త్రీ: పొద్దున్న మిగిలిన సగం కేక్ మీద మూత పెట్టడం మర్చిపోయాను. స్కూల్‌నుంచి వచ్చిన తరువాత కనిపించలేదు. బహుశాః ఎలుకలు తినేసి ఉంటాయి.....పదండి.

పురు: ఇవన్నీ ఆలోచించి ఆలోచించి మనస్సు ఉదాసీనమైపోతుంది.

స్త్రీ: ఇంకా ఆ ఉదాసీనం పోలేదా? నే పోగొడతానుండండి. ఆలోచించి ఉదాసులవడం లేదు – ఉదాసీనంగా ఉండబట్టే ఆలోచన్లు వస్తున్నాయి.

పురు: ఇంకా ఉదాసీనం ఏమిటి నా మొహం....అది కాస్తా ఎప్పుడో పోయి ఉంటుంది.

స్త్రీ: దేనికోసం మీరలా ఉంటున్నారో నాకు తెలియడం లేదు – ఆ.......పోయిందా?

పురు: నాకేం కావాలంటే.......

స్త్రీ: ఆ...అదీ సంగతి. మీకందుబాటులో లేనిదాన్ని మీరు కావాలనుకుంటారు.

పురు: అంటే....ఎలా!

స్త్రీ: ఎలా అంటే ఏం చెప్పను. దేవ్ వెళ్లిపోయాడనే దుఃఖం మీలో ఇంకా ఉంది.

పురు: (చిన్నగా నిట్టూర్చి) కావచ్చు!

స్త్రీ: మిమ్మల్ని మీరెప్పుడూ అవతల వాళ్ళతో కలుపుకుంటారు – వాళ్ళనించి విడిగా ఉండి ఆలోచించలేరు.

పురు: ఎవరితో –

స్త్రీ: ఎవరితో ఏమిటి! మీకు కావాలసి వాళ్ళతో – వస్తువులతో – మీ మనస్సు ఎవరెవరితో పెనవేసుకుందో వాళ్ళతో – ఆ వస్తువులలో